
సాక్షి
కామారెడ్డి
శనివారం : 9 : ఆగస్టు : 2025



జోరుగా పేకాట దందా

బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ ప్రాంతాల్లో గ్రూపులుగా ఏర్పడి జోరుగా పేకాట కేంద్రాలను కొనసాగిస్తున్నారు.

- 8లో ▸



అడవిని తలపించేలా..

భిక్కనూరులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణం ముళ్లపొదలతో నిండి పోయింది. మూడేళ్లుగా శుభ్రం చేయడం లేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /20.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ వినియోగించొద్దు



ఎల్లారెడ్డి : ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వెళ్లే సమయంలో చేతి సంచులను తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు చేతి సంచులతో వచ్చిన వారికి శుక్రవారం ఆయన పూలు అందజేసి అభినందించారు. ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించుకుండా గాజు గ్లాసులు వినియోగిస్తున్న హోటళ్ల యజమానులను ఆయన సన్మానించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రోలో బంగారు పతకం



కామారెడ్డి అర్బన్ : రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో అథ్లెటిక్స్‌లో జిల్లాకు బంగారు పతకం దక్కింది. జనగామ జిల్లా ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించిన నాల్గో రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో అథ్లెటిక్స్ మీట్–2025లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎం.అమృత అండర్ –20 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. జట్టు కోచ్‌గా జి.నవీన్ వ్యవహరించారన్నారు. అమృతను పలువురు అభినందించారు.

రైతునేస్తంతో లబ్ధి పొందాలి



కామారెడ్డి అర్బన్ : ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో పాల్గొని లబ్ధిపొందాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇస్రోజీవాడిలో సాగవుతున్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇస్రోజీవాడి రైతు వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. పంటల సస్యరక్షణ, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుద్ధ్యంపై మాట్లాడారు. ఆయన వెంట ఏఈవో దేవేంద్ర, మార్కెట్ డైరెక్టర్ సుదర్శన్‌రావు, తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్‌కు ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగుల (17.8 టీఎంసీ)కు గాను ప్రస్తుతం 1390.95 అడుగులు (4.448టీఎంసీ)ల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 600 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.

జుక్కల్ మండలం బంగారుపల్లిలో మక్తవార్ గంగవ్వ గృహ ప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇల్లు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అగ్రస్థానం!

- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన కామారెడ్డి జిల్లా
- పురోగతిలో సగానికిపైగా ఇళ్ల నిర్మాణాలు..
- బంగారుపల్లిలో ఓ ఇంటి నిర్మాణం పూర్తి
- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిచింది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం నిరంతరం శ్రమించిన ఫలితంగా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ సెక్రెటరీ, మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం.. రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తోపాటు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు కలిపి 12,090 ఇళ్లు కేటాయించగా, 11,818 ఇళ్లు మంజూరు చేశారు. 5,770 ఇళ్లు గ్రౌండింగ్ అవడంతోపాటు 2,342 ఇళ్లు బేస్మెంట్ పనులు పూర్తయ్యాయి. 157 ఇళ్ల గోడల పనులు కాగా, 75 ఇళ్లు రూఫ్ లెవల్‌కు చేరాయి. ఒక ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా ప్రతిరోజూ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. దీంతో పనులు వేగంగా సాగుతున్నాయి. శ్రావణ మాసం పూర్తయ్యేలోగా వందకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిపించాలనే లక్ష్యంతో అధికారులు అడుగులు వేస్తున్నారు.

ప్రతి రోజూ పురోగతి నివేదిక!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రోజుకు ఒకటి రెండు మండలాల్లో పర్యటిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో పనులు వేగవంతం అయ్యేలా అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించే క్రమంలో లబ్దిదారులతో మాట్లాడి ఏమైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ప్రతి రోజూ సాయంత్రం వరకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పురోగతి పై నివేదిక తెప్పించుకుని, ఎక్కడైనా వెనుకబడి ఉంటే అక్కడి అధికారులతో మాట్లాడుతున్నారు.

స్వయం సహాయక రుణాలు

లబ్ధిదారులు సొంత డబ్బులు పెట్టుకుని మొదలు పెట్టాల్సి ఉంటుంది. బేస్మెంట్ వరకు పనులు అయిన తరువాత మొదటి బిల్లు ఖాతాలో జమవుతుంది. అయితే చాలా మంది చేతిలో డబ్బులు లేక నిర్మాణానికి అవసరమైన సామగ్రి తెచ్చుకోలేకపోతున్నారని గుర్తించిన ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం తీసుకునే అవకాశం కల్పించింది. ఎస్‌హెచ్‌జీ రుణాల కోసం 970 మంది ఇందిరమ్మ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా, 501 మంది వివరాలు బ్యాంకులకు చేరాయి. కాగా 439 మందికి ఇప్పటి వరకు రూ.5.13 కోట్లు మంజూరయ్యాయి. ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు ఇబ్బందులు తొలగిపోవడంతో పనుల్లో వేగం పెరుగుతోంది.

ఇసుక, మొరం కొరత లేకుండా చూడాలి



రంగంపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రామారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మొరం, ఇటుకల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రంగంపేటలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తున్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పేదలు సంతోషంగా సొంత ఇంటిలో నివసించేందుకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంటి నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల మెటీరియల్స్ లభ్యమయ్యేలా అధికార యంత్రాంగం చూసుకుంటుందని పనులు పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం రైతు వేదికలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఉమాలత, ఎంపీడీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గాల వారీగా..

నియోజక వర్గం	టార్గెట్	మంజూరు	మంజూరు చేయాల్సినవి	గ్రౌండింగ్	బేస్మెంట్ లెవల్	వాల్ లెవల్	రూఫ్ లెవల్
కామారెడ్డి	3,500	3,415	85	2,006	804	51	15
ఎల్లారెడ్డి	3,500	3,500	00	1,890	734	42	31
జుక్కల్	3,500	3,445	55	1,347	578	54	21
బాన్సువాడ	1,590	1,458	132	527	226	10	08
మొత్తం	12,090	11,818	272	5,770	2,342	157	75

మరింత వేగంగా జరగాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం సంతోషం కలిగించింది. పనులు మరింత వేగంగా జరగాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తున్నందున లబ్దిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూసుకోవాలి. సామగ్రి కొరత తలెత్తకుండా, అలాగే బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్

నస్రుల్లాబాద్‌లో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కొన్ని చోట్ల ఆలయాల్లో పండితుల సమక్షంలో సామూహిక వ్రతాలు ఆచరించగా, చాలా మంది మహిళలు తమ ఇళ్లలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సుమంగళిలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి : వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు సూచించారు. పాల్వంచ మండలంలోని భవానీపేట–పోతారం గ్రామాల మధ్య ఉన్న వాగును కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి ఉధృతి అధికంగా ఉన్నందున వంతెన పైనుంచి నీరు ప్రవహించకముందే వాహనాల రాకపోకలను నిలిపివేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ మోహన్‌ను ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు వర్ష సూచనలు తెలుసుకుంటూ, ఆయా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో, అలాగే దండోరా ద్వారా ప్రజలకు సమాచారం అందించాలన్నారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ విక్టర్ తదితరులున్నారు.



నేలకొరిగిన భారీ వృక్షం

గంటపాటు రాకపోకలకు అంతరాయం

వర్షం కారణంగా ఓ భారీ వృక్షం నేలకొరిగి రోడ్డుపై అడ్డంగా పడిన ఘటన కామారెడ్డి – సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉగ్రవాయి వాగు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రోడ్డుపై చెట్టు పడిపోవడంతో సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో చెట్టును పక్కకు తొలగించారు. – కామారెడ్డి క్రైం

ఢిల్లీలో కాంగ్రెస్ దొంగ దీక్షలు



మీడియాతో మాట్లాడుతున్న చిన్న రాజులు

కామారెడ్డి క్రైం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయకుండా ఢిల్లీలో కాంగ్రెస్ దొంగ దీక్షలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ డ్రామాలు చేస్తోందన్నారు. ముస్లిం లను బీసీల్లో కలపకుండా రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభిస్తే మద్దతు ఇవ్వడానికి బీజేపీ సిద్ధంగా ఉన్నారని ఇదివరకే కేంద్ర మంత్రులు స్పష్టం చేశారన్నారు. అయినప్పటికీ రిజర్వేషన్‌లను బీజేపీ ఆపుతోంది అంటూ కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేపట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలైన బీసీలకు అన్యాయం జరగకుండా ముస్లింలను బీసీ కోటా నుంచి తప్పించాలన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాతంగల్ కిషన్‌రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

11న చలో హైదరాబాద్

కామారెడ్డి అర్బన్: పెన్షనర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.హన్మంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.విజయరామరాజులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగదు రహిత ఆరోగ్యబీమా, డీఏ బకాయిల విడుదల, పీఆర్సీ, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు తదితర డిమాండ్ల సాధనకోసం ధర్నా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

హైవే రూట్ మ్యాప్ రెడీ!

- మద్నూర్ – బోధన్ జాతీయ రహదారికి త్వరలో భూ సేకరణ
- పెగ్ మార్కింగ్‌కు సర్వం సిద్ధం
- 39 కిలోమీటర్ల నాలుగు లైన్ల జాతీయ రహదారి
- 9 గ్రామాల పరిధిలో 142 ఎకరాల భూమి అవసరం
- జిల్లాకు మరో 161బీబీ జాతీయ రహదారి

మద్నూర్(జుక్కల్) : ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మద్నూర్–బోధన్ జాతీయ రహదారి నిర్మాణ పనులకు చకచకా అడుగులు పడుతున్నాయి. బడ్జెట్, డిజైన్, విస్తరణ, మౌలిక వసతులు, సాంకేతిక అంశాలు తదితర వాటికి సంబంధించి పనులు ముందుకు సాగుతున్నాయి. మద్నూర్ మండల కేంద్రం నుంచి సిర్‌పూర్, నిజామాబాద్ జిల్లాలోని పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మీదుగా బోధన్ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు పూర్తయ్యాయి. ఈ జాతీయ రహదారికి 161బీబీ అని నామకరణం చేస్తూ ప్రభుత్వం 2021లో గెజిట్ విడుదల చేసింది. మొదట మద్నూర్, బోధన్, బాసర, భైంసా వరకు రోడ్డును ప్రకటించారు. కానీ మద్నూర్ నుంచి బోధన్ వరకు ఒక హైవేగా నిర్ధారించి బోధన్ నుంచి భైంసా వరకు రహదారిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బోధన్ నుంచి భైంసా వరకు 90 శాతం జాతీయ రహదారి పనులు పూర్తి కాగా మద్నూర్ నుంచి బోధన్ వరకు పలు కారణాలతో ఆలస్యం జరిగిందని హైవే అధికారులు తెలిపారు.

రూ.640 కోట్లతో డీపీఆర్ సిద్ధం

మద్నూర్ నుంచి బోధన్ వరకు జాతీయ రహదారి 161బీబీకి రూ.640 కోట్ల అంచనాతో 39 కిలో మీటర్ల దూరంతో డీపీఆర్‌ను సిద్ధం చేశారు. మద్నూర్, డోంగ్లీ రెండు మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల శివారులోని భూమిని అధికారులు గుర్తించారు. మద్నూర్ మండలంలోని వాడి ఫత్తేపూర్ శివారులో 8 ఎకరాలు, మద్నూర్ శివారులో 5 ఎకరాలు, సోనాల శివారులో 17 ఎకరాలు, తడి హిప్పర్గా శివారులో 24 ఎకరాలు, మహల్సాపూర్ శివారులో 25 ఎకరాల భూమి జాతీయ రహదారికి అవసరం ఉందని సర్వే నిర్వహించారు. అలాగే డోంగ్లీ మండలంలోని లింబూర్ శివారులో 33 ఎకరాలు, హసన్ టాక్లీ శివారులో 13 ఎకరాలు, పెద్ద టాక్లీ శివారులో 16 ఎకరాలు, సిర్‌పూర్ శివారులో 21 ఎకరాల భూమి సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. మొత్తం 142 ఎకరాల భూమి అవసరమవుతుందని ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులు చెప్పారు. మద్నూర్ నుంచి బోధన్ వరకు గల గ్రామాల పక్క నుంచి ఈ రహదారి వెళ్తుంది. హైవే పనులు పూర్తయితే దూర ప్రాంతాల కనెక్టివిటీ మెరుగుపడుతుంది. వ్యాపారులకు, ప్రజలకు అనేక ప్రయోజనాలు అందనున్నాయి. రోడ్డు నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రహదారిలో పలు భద్రతాప్రమాణాలు పాటించనున్నారు. మద్నూర్ నుంచి బోధన్ నిజామాబాద్‌కు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు పనుల నిమిత్తం వెళ్తుంటారు. హైవే నిర్మాణంతో భవిష్యత్‌లో ఆర్థికాభివృద్ధి పుంజుకోనుంది.

ముమ్మరమైన సర్వే పనులు

మద్నూర్ నుంచి బోధన్ వరకు సర్వే పనులు చకచకపూర్తవుతున్నాయి. నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సర్వే పనులు పూర్తి చేసి పెగ్ మార్కింగ్ వేయనున్నారు. నాలుగు వరుసల రహదారి కోసం భూసేకరణ పూర్తయిన వెంటనే పనులకు సంబంధించి టెండర్లు నిర్వహించనున్నారు.



మద్నూర్–బోధన్ పాత రహదారి



మద్నూర్‌లో నూతన హైవే ప్రారంభమయ్యేది ఇక్కడి నుంచే..



మద్నూర్ నుంచి నూతన ఎన్‌హెచ్161బీబీ రోడ్డు వెళ్లే మార్గం

రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు..!

హైవే నిర్మాణానికి అవసరం ఉన్న భూముల్లో సర్వే నిర్వహించామని, భూములు కోల్పోతున్న రైతుల వివరాలు, సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు నేషనల్ హైవే అధికారులకు పంపించారు. జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారంపై విచారణ నిర్వహించి రైతులకు మంచి ధర వచ్చేటట్లు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎకరానికి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పరిహారం అందించేలా చర్యలు కొనసాగుతున్నట్లు తెలిసింది.



సెల్ఫీ విత్ రాఖీ..

తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచేది రక్షాబంధన్. నేడు పండుగను పురస్కరించుకొని సోదరులకు సోదరీమణులు రాఖీలు కడతారు. సోదరులు వారికి తోచిన కానుక అందించి, ఆశీర్వాదం తీసుకుంటారు. కుటుంబమంతా జరుపుకొనే ఈ వేడుకలను సెల్ఫీ తీసుకొని మురిసిపోతారు. మీ సెల్ఫీలను 'సాక్షి'తో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే మా నెంబర్‌కు మీ సెల్ఫీలను పంపండి.

నెంబర్ : 955 3955 625

క్లుప్తంగా

ప్రముఖులకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీ స్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు అడిషనల్ కలెక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకుల కు రాఖీలు కట్టి, మిఠాయిలు అందజేసి రక్షబంధన్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఓం శాంతి నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి బీకే జయ దీదీ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బల్దియా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. బల్దియాకు వచ్చే ఆదాయంతోపాటు బల్దియాకు రావాల్సిన బకాయిలపై శ్రద్ధచూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని వెల్లడించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి బల్దియా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గంటల తరబడి తిప్పాల్సిందే..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టలన్నా.. నీటి విడుదల పెంచాలన్నా.. తగ్గించాలన్నా గంటల తరబడి గేట్లను తిప్పాల్సిందే. లేదంటే గేట్లు లేవవు, దిగవు. గేట్లకు కరెంట్ సరఫరా లేకపోవడంతో సిబ్బంది చేతులతోనే వాటిని ఎత్తుతున్నారు. శుక్రవారం నీటి విడుదల పెంచడం కోసం ఉదయం 7గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు గేట్లను తిప్పితే 200 క్యూసెక్కులకు నీటి విడుదల పెరిగింది. గంటల తరబడి గేట్లను తిప్పడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పేకాట దందా

- అడ్డంగా బుక్ అవుతున్న బడాబాబులు
- చేతులు మారుతున్న రూ.లక్షలు



బాన్సువాడ: పోలీసుల కంటపడకుండా ఉండేందుకు పేకాట ఆడేవారు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పేరుతో ఎవరైనా వచ్చి పట్టుకుంటారేమోనని ఆందోళనతో వీరు ఎవరి కంటపడకుండా ఉండేందుకు రహస్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. వారం పది రోజులుగా పోలీసులు జరుపుతున్న దాడుల్లో బడాబాబులు అడ్డంగా బుక్ అవుతున్నారు. బాన్సువాడ డివిజన్‌లోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ ప్రాంతాల్లో పేకాటరాయుళ్లు గ్రుపులుగా ఏర్పడి పేకాట కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పది పదిహేను రోజులుగా పేకాట స్థావరాలపై పోలీసులు నిర్వహిస్తున్న దాడుల్లో బడా వ్యాపారవేత్తలు బుక్ అవుతున్నారు. ఈ కేంద్రాల్లో రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పేకాటాడుతుండడంతో నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నాయి.

మూడు మండలాల అటవీ ప్రాంతం..

బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ శివారులో ఉండే అటవీ ప్రాంతాల్లో పోలీసులు ఈ దిశగా దృష్టి సారించలేకపోతున్నారు. బాన్సువాడ మండలంలోని ముదెల్లి అటవీ ప్రాంతంతో పాటు హన్మాజీపేట్, కొత్తాబాది, బుడ్మి గ్రామ శివారుల్లో పేకాట అడ్డాలు కొనసాగుతున్నాయి. బాన్సువాడ పట్టణంలో దాడులు జరుగుతున్నా పేకాట రాయుళ్ల మాత్రం తమ పద్ధతి మార్చుకోవడం లేదు. పోలీసులకు ఇటీవల బడా వ్యాపారవేత్తలు, రియల్టర్లతో పాటు పలువురు దొరికారు. కొందరు బాన్సువాడకు చెందిన కొందరు వ్యాపారులు పేకాట ఆడేవారిని కర్ణాటక, మహారాష్ట్రలకు తమ సొంత వాహనాల్లో తరలిస్తున్నట్లు తెలిసింది. ఆయా రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులు అక్కడే ఉండి పేకాట ఆడించి మళ్లీ తమ వాహనాల్లోనే బాన్సువాడకు తీసుకువస్తారు. ఇలా తీసుకెళ్తే వారికి వాహనాల అద్దెతో పాటు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పేకాట అడ్డాల నిర్వాహకులకు కమీషన్ కూడా ఇస్తారని తెలిసింది.

ఇటీవల పోలీసులు జరిపిన దాడుల వివరాలు..

- మూడు నెలల క్రితం బాన్సువాడ–బోధన్ రోడ్డులోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.
- గత నెల 8న బాన్సువాడ పట్టణంలో పార్కుకు వెళ్లే దారిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు.
- ఈ నెల 3న సంగోజీపేట్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేశారు.
- 6న పట్టణంలోని సరస్వతి మందిరం సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు.

ప్రత్యేక నిఘా పెట్టాం

పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. పేకాట ఆడే వాళ్లలో ఎంత పెద్ద వాళ్లు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పేకాట ఆడేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిపై కూడా నిఘా పెడతాం. పేకాట ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దు.

– అశోక్, సీఐ, బాన్సువాడ

భక్తిశ్రద్ధలతో రాజరాజేశ్వరీ దేవి నవమి వార్షికోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి అర్బన్: స్థానిక వీక్లీ మార్కెట్‌లోని శ్రీరాజరాజేశ్వరీ దేవి ఆలయ నవమి వార్షికోత్సవం పట్టణ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు అష్టోత్తర కలశాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పట్టణ మున్నూరు కాపు సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. నేతలు ముదాం శ్రీనివాస్, మల్లేశం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణమాస భజనలు



సదాశివనగర్‌లో కొనసాగుతున్న భజనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అమర్లబండ, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి, పద్మాజీవాడి, ఉత్నూర్, కల్వరాల్ తదితర గ్రామాల్లో శ్రావణమాస భజనలు కొనసాగుతున్నాయి. ఆలయాల్లో ప్రతి రోజు కీర్తనలు ఆలపిస్తూ భక్తిని చాటుతున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బీబీపేటలో కాలనీలో పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్

బీబీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శేరి గల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆరోగ్య కార్యకర్తలు హరిప్రసాద్, సుశీల, ఆశ కార్యకర్తలు గంగ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం నిల్వనీటిని పారబోయాలి

బాన్సువాడ రూరల్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శుక్రవారం నీటి తొట్టెలు, ట్యాంకుల్లో నీటిని పారబోసి కొత్త నీటిని నింపుకోవాలని బోర్లం పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన బోర్లం గ్రామంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో కలిసి ప్రజలను చైతన్య పరిచారు. ఏఎన్‌ఎం అనురాధ, ఆశ కార్యకర్త సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో శుక్రవారం ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాలలో తిరుగుతూ సీజనల్ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయో ప్రజలకు అవగాహన కల్పించారు.

మహిళల స్వయం ఉపాధికి రోటరీ కృషి అభినందనీయం



కామారెడ్డి అర్బన్: మహిళల స్వయం ఉపాధికి రోటరీ క్లబ్, పీపుల్ ఫర్ ఇండియా సంస్థ ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లో దాదాపు రూ.4 లక్షల విలువైన ఎంబ్రాయిడరీ మిషన్, రూ.50 వేల విలువైన తాటిపత్రిలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, రోటరీ ప్రతినిధులు శంకర్, కృష్ణహరి, ప్రొగ్రాం చైర్మన్ రాజనర్సింహారెడ్డి, వెంకట రమణ, గర్గుల్ సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలిమి భీంరెడ్డి, నవీన్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి రుణాల వసూళ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యుల వద్ద పేరుకుపోయిన రుణ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన వీవోఏలతోపాటు సీసీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి 87 శాతం బకాయిలు ఉన్నాయన్నారు. వీటితోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు ఈ యేడు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.37కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.7 కోట్లు ఇచ్చారని చెప్పారు. గ్రామాల్లో వృద్ధుల, వికలాంగుల, కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంత, అకౌటెంట్ రాజు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లకు రాఖీ శోభ



ఎల్లారెడ్డిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: రాఖీ పండుగ నేపథ్యంలో మార్కెట్లు శోభ సంతరించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో రాఖీల దుకాణాలు వెలిశాయి. యువతులు, మహిళలు పెద్దెత్తున రకరకాల రాఖీలు కొనేందుకు పోటీపడ్డారు. అలాగే పలు చోట్ల ఒక రోజు ముందుగానే రాఖీ పండుగ చేసుకున్నారు. ప్రముఖులకు రాఖీలు కట్టారు.





కామారెడ్డిలోని మార్కెట్‌లో రాఖీలు కొంటున్న మహిళలు



భిక్కనూరు ఎస్సై ఆంజనేయులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



సౌత్‌క్యాంపస్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి

తోరణాలు కావవి.. మొక్కజొన్న జోళ్లు



తోరణాలను తలపిస్తున్న మొక్కజొన్న జోళ్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో ఓ రైతు తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న జోళ్లు చూడడానికి చక్కని తోరణాల మాదిరిగా కనిపిస్తున్నాయి. గత రబీ సీజన్లో సాగుచేసిన మొక్కజొన్న దిగుబడులను రాబోయే కాలంలో తినడానికి పురుగుపట్టకుండా నిల్వ చేసుకోవడానికి ఇంటి ముందు ఇలా జోళ్లను ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా చేయడం వల్ల మొక్కజొన్న గింజలకు పురుగు పట్టకుండా ఉంటుందని గిరిజన రైతు రమావత్ కిషన్‌నాయక్ తెలిపారు. దీంతోపాటు రాబోయే రోజుల్లో తాము వాటిని పిండిగా మార్చుకొని రొట్టెలు చేసుకుంటామని ఆయన చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం దొన్కల్‌లో ఒకరిని హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మోర్తాడ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొన్కల్‌లోని వడ్డెర కాలనీలో జూన్ 26న ఒల్లెపు నాగరాజు, షేక్ రహమాన్‌తో మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో రహమాన్‌ను నాగరాజు కర్రతో కొట్టగా అతడు మృతిచెందాడు. అప్పటి నుంచి నిందితుడు నాగరాజు పరారీలో ఉన్నాడన్నారు. విశ్వసనీయ సమాచారం రావడంతో నాగరాజును పట్టుకొని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శుక్రవారం తెల్లవారుజామున రెండు ఇసుక టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటిని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని గోప్యతండా పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గడ్డమీదితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని రూప్లనాయక్ తండా వద్ద గల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన తుంగర్ బాలాజి(50) స్థానిక హోటల్‌లో పని చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి అతడు రూప్లానాయక్ తండా నుంచి దేవి తండాకు నడుచుకుంటూ హైవేపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సాయిబాబా ఆలయంలో దొంగతనం జరిగినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి వెండి కిరీటం, ఇత్తడి సాయిబాబా విగ్రహం, ఇత్తడి సామగ్రి అపహరించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు గుడికి వెళ్లగా, చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వారు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడి కిడ్నాప్

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి తండాకు చెందిన కెతావత్ హరీష్ (17) కిడ్నాప్‌నకు గురైనట్లు ఎస్సై జాడె సుస్మిత శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన హరీష్‌కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో వారిని మందలించాడు. ఈక్రమంలో వివాహితను ఆమె భర్త ఈనెల 5న రాంచంద్రపల్లిలోని తల్లిగారింట్లో వదిలేసి వచ్చాడు. 7న సదరు వివాహిత హరీష్‌కు ఫోన్ చేయడంతో అతడు నిజామాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలుడి సోదరి హరీష్ కిడ్నాప్‌కు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాబాపై పోలీసుల దాడి

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం శివారులో గల దాబాపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా దాబాలో, బెల్టుషాపుల్లో లిక్కర్ అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్ తెలిపారు. ఈ దాడిలో ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పేకాడుతున్న పలువురి అరెస్టు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4,320 నగదు, 7 సెల్ ఫోన్లు, 2 బైకులతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 4510 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 8470 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ నాగారం: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని, క్రీడల ద్వారానే విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శుక్రవారం ఇందూర్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు సరైన సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియం కావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఇందూర్ బిడ్డలు జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్ స్థాయిలో రాణించి జిల్లాకు మరింత పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. నాయకులు ఎర్రం సుధీర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: మండలంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ శుక్రవారం కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ అనిల్‌రెడ్డి, సిబ్బంది కలిసి కమ్మర్‌పల్లిలోని మెట్‌పల్లి రోడ్‌లోగల రైస్‌మిల్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో స్కూటీపై ఇద్దరు వ్యక్తులు కమ్మర్‌పల్లి వైపు వస్తుండగా, పోలీసులు వారిని తనిఖీ చేయగా 4 గంజాయి ప్యాకెట్‌లు కనిపించాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారిని జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన నాంపల్లి వికాస్, కమ్మర్‌పల్లికి చెందిన షేక్ ఇమ్రాన్‌గా గుర్తించారు. గంజాయిని కమ్మర్‌పల్లిలో విక్రయించడానికి తీసుకువస్తున్నామని, ఇంతకుముందు కూడా వికాస్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కమ్మర్‌పల్లిలో విక్రయించానని షేక్ ఇమ్రాన్ ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి 20 గ్రాములు ఉందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అప్సర్ సిబ్బంది రాజ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, నవీన్‌చంద్ర, లక్ష్మణ్ నేత, గణపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాజివాడిలో ఒకరి ఆత్మహత్య



శ్రీకాంత్‌రావు (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రహ్మాజివాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జోలే శ్రీకాంత్‌రావు(30) కామారెడ్డిలో ఓ ప్రయివేటు జాబ్ చేస్తున్నాడు. అతడికి వివాహం జరిపించడానికి కుటుంబ సభ్యులు గత కొన్ని సంవత్సరాల నుంచి పెండ్లి సంబంధాలు చూస్తున్నప్పటికీ కుదరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్‌రావు శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని, మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బాన్సువాడ రూరల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా.. మండలంలోని చిన్నరాంపూర్ గ్రామం పులికుచ్చ తండాకు చెందిన జప్పిబాయి (60) అనే వృద్ధురాలు గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయింది. ఈక్రమంలో ఈనెల 7న ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్సనిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెట్టుబడి పేరుతో సైబర్ మోసం

గాంధారి(ఎల్లారెడ్డి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి, ఒకరి వద్ద నుంచి సైబర్ మోసగాళ్లు రూ.లక్ష వరకు కాజేశారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల పరిధిలోని గండివేట్ తండాకు చెందిన అనిల్ అనే వ్యక్తికి ఇటీవల గుర్తు తెలియన వ్యక్తి వాట్సప్ కాల్‌చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించాడు. తాను పంపిన లింకుకు డబ్బులు పంపించాలని సూచించడంతో అనిల్ సదరు లింకుకు డబ్బులు పంపించాడు. అనంతరం తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు వెంటనే 1930 నంబరుకు సమాచారం అందించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీల్లో వ్యక్తి వీరంగం

- పెట్రోల్ పోసుకుని, పోలీసుపై పోసి హంగామా

కామారెడ్డి క్రైం: పోలీసుల వాహనాల తనిఖీలకు విసిగిపోయిన ఓ వ్యక్తి అసహనంతో పెట్రోల్ పోసుకొని వీరంగం సృష్టించిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన ఎల్లయ్య అనే వ్యక్తి శుక్రవారం ఆస్పత్రి పనుల నిమిత్తం కామారెడ్డికి వచ్చి, సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరాడు. టేక్రియాల్ బైపాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా, అతడి బైక్‌ను ఆపారు. తన వాహనాన్ని తరచూ ఆపుతూ జరిమానాలు వేస్తున్నారని ఎల్లయ్య అసహనానికి గురయ్యాడు. బండిలో పెట్టుకున్న పెట్రోల్ బాటిల్‌ను తీసుకొని ఒంటిపై పోసుకోవడమే కాకుండా అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్‌పై కూడా కొంత పోశాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై, అతడిని అడ్డుకుంటుండగా నానా హంగామా సృష్టించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు.

సుభాష్‌నగర్‌లో అగ్నిప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్ నగర్‌లోగల ఓ ఇంటీరియర్ షాప్‌లో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ శంకర్ తెలిపారు. షాపు నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.